సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 02 | సంచిక : 135 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం, 24 సెప్టెంబర్ 2025 | పేజీలు : 4




## దేవీ నవరాత్రి వేడుకల్లో జాగ్రత్తలు పాటించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

4లో

# మేడారానికి కేంద్రం నిధులివ్వాల్సిందే..

- కుంభమేలా చేసుకున్న పుణ్యమేంది?
- మేడారం చేసుకున్న పాపమేంది?
- కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు
- మేడారం అభివృద్ధి పనులపై సమీక్ష
- జాతర లోగా పనుల పూర్తికి ఆదేశాలు



ఆదివాసీల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కుంభమేళాకు రూ.వేల కోట్లు ఇస్తున్న కేంద్రం.. ఆదివాసుల కుంభమేళా 'మేడారం జాతర'కు మాత్రం ఎందుకు నిధులు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. ఈ జాతరకు జాతీయ హోదా గుర్తింపు ఇవ్వాలని, ఈ మేరకు నిధులు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములుగు జిల్లా మేడారం సమ్మక్క-సారలమ్మ అమ్మవార్ల గద్దెలను దర్శించుకున్న అనంతరం ఆలయ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. అనంతరం ఏర్పాటు-చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఆలయ అభివృద్ధి బాధ్యతతో కూడిన భావోద్వేగమని పేర్కొన్నారు.

2

# మేడారానికి కేంద్రం నిధులివ్వాలి

- కుంభమేలా చేసుకున్న పుణ్యమేంది?
- మేడారం చేసుకున్న పాపమేంది?
- కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు
- మేడారం అభివృద్ధి పనులపై సమీక్ష
- జాతర లోగా పనుల పూర్తికి ఆదేశాలు
- గద్దెలను దర్శించుకుని ప్రత్యేక పూజలు







**మన చౌరాస్తా, ములుగు ప్రతినిధి :**

ఆదివాసీల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కుంభమేళాకు రూ.వేల కోట్లు ఇస్తున్న కేంద్రం.. ఆదివాసుల కుంభమేళా 'మేడారం జాతర'కు మాత్రం ఎందుకు నిధులు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. ఈ జాతరకు జాతీయ హోదా గుర్తింపు ఇవ్వాలని, ఈ మేరకు నిధులు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములుగు జిల్లా మేడారం సమ్మక్కసారలమ్మ అమ్మవార్ల గద్దెలను దర్శించుకున్న అనంతరం ఆలయ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఆలయ అభివృద్ధి బాధ్యతతో కూడిన భావోద్వేగమని పేర్కొన్నారు. ఈ పనులతో మంత్రి సీతక్కతోపాటు తన జన్మ ధన్యమైనట్లేనన్నారు. సమ్మక్క సారలమ్మ ఆశీస్సులతో 2023 ఫిబ్రవరి 6న ఇక్కడినుంచే పాదయాత్ర మొదలు పెట్టా. తెలంగాణకు పట్టిన చీడపీడలను వదిలించేందుకు ఈ గడ్డపై నుంచి అడుగులు వేశాం. ఆనాడు పాలకులు సమ్మక్క సారలమ్మ ఆలయ అభివృద్ధిపై వివక్ష చూపారు. కానీ, మా ప్రభుత్వం ఎన్ని రూ.కోట్లయినా మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉంది. ఆదివాసులను, పూజారులను, సంప్రదాయ కుటుంబాలను ఇందులో భాగస్వాములను చేస్తున్నాం అని అన్నారు. సమ్మక్క, సారలమ్మ ఆశీర్వాదంతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడిరది. శాశ్వత ప్రాతిపదికన ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. స్థానికుల అభిప్రాయాలు తెలుసుకొనేందుకే ఇక్కడికి వచ్చానని వివరించారు. 100 రోజుల్లో పనులు పూర్తయ్యేలా అధికారులు చూడాలి. రాతి కట్టడాలతోనే నిర్మాణాలు ఉండేలా డిజైన్లు రూపొందించాం. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొనేలా నిర్మాణాల రూపకల్పన చేశాం. జంపన్నవాగులో నీరు నిల్వ ఉండేలా ప్రణాళికలు రూపొందించాలి. రాబోయే వంద రోజుల్లో నిష్ఠతో పనులు పూర్తి చేయాలి. రాతి కట్టడాలే నిర్మిస్తాం. మహా జాతర నాటికి పనులు పూర్తి చేస్తాం. స్థానికుల భాగస్వామ్యం, సహకారంతోనే ఇది సాధ్యం. మహా జాతరకు మళ్లీ వస్తా. ఈసారి జాతరను గొప్పగా చేసుకుందాం అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అంతకుముందు మేడారం ఆలయ అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో భాగంగా పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలను సీఎం రేవంత్ తెలుసుకున్నారు. పోరాటానికి, పౌరుషానికి స్ఫూర్తి సమ్మక్క, సారలమ్మలు. ఆ అమ్మవార్ల ఆశీర్వాదంతో ప్రజాప్రభుత్వం ఏర్పడిరది. నేను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి వనదేవతలను సందర్శిస్తున్నా. ప్రకృతి వైపరీత్యాలనూ తట్టుకునేలా శాశ్వత ప్రాతిపదికన ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. సంప్రదాయంలో వీసమెత్తు కూడా తేడా రాకుండా ఉండాలనేదే మా అభిమతం. ఆదివాసీ పోరాట చరిత్రను, స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించేలా పనిచేయాలని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అలయ అభివృద్ధి, విస్తరణకు సంబంధించిన ప్రణాళికలు, డిజైన్‌లను అధికారులు పూజారులకు, ఆదివాసీ సంఘాలకు వివరించారు. ఈ ప్రణాళికలపై ఆలయ పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలు తెలుసుకున్న సీఎం, వారి ఏకాభిప్రాయం పొందిన తర్వాతనే పనులు ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆయన ఆదివాసీల సంస్కృతికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆదివాసీలు దేశానికి మూలవాసులని, వారి సంప్రదాయాలు, విశ్వాసాలను పరిగణనలోకి తీసుకుని మాత్రమే ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని.. వారి సంప్రదాయంలో ఏమాత్రం మార్పు రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధిని డబ్బులతో కాకుండా భక్తితో చూడాలని, ఈ నమ్మకాన్ని మరింత పెంచేలా పనులు జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పనులు వంద రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉందని, పనులను పూర్తి చేసే బాధ్యత అధికారులదేనని పేర్కొన్నారు. జంపన్న వాగులో నీరు నిల్వ ఉండేలా చెక్‌డ్యామ్‌లు నిర్మించాలని సాగునీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు.

ఇంకా ఆలయ అభివృద్ధి కోసం ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని కూడా సూచించారు. తన రాజకీయ ప్రస్థానం గురించి మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి అమ్మవార్లను దర్శించుకుంటున్నానని అమ్మవార్ల ఆశీర్వాదంతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడిరదని పేర్కొన్నారు. ఆదివాసీల పోరాటానికి సమ్మక్క, సారలమ్మలు స్ఫూర్తి అని కొనియాడారు. ఆదివాసీలు దేశానికి మూలవాసులని పేర్కొంటూ, వారి సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఐటీడీఏ ప్రాంతాల్లో అదనంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు చెప్పారు. ఏ సంక్షేమ పథకం అయినా ఆదివాసీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తున్నామని అన్నారు. సమ్మక్క సారక్కల గద్దెల అభివృద్ధి, ప్రాంగణ పునర్నిర్మాణం మా జీవితంలో గొప్ప ఘట్టం. ఆలయ అభివృద్ధికి ఎన్ని కోట్లయినా ప్రభుత్వం మంజూరు చేసేందుకు సిద్ధం. ఈ కార్యక్రమంలో ఆదివాసీలు, పూజారులు, సంప్రదాయ కుటుంబాలందరినీ భాగస్వాములను చేస్తున్నాం అని స్పష్టం చేశారు. మహాజాతరకు ముందే పనులు పూర్తిచేసేలా అధికారులు పగలు, రాత్రి పనిచేయాలని ఆదేశించారు. భక్తితో, సమ్మక్క మాలధారణ చేసినట్లుగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

## కేంద్రాన్ని ఒప్పించాలి..

ఆదివాసీల కుంభమేళా మేడారం మహాజాతరకు కేంద్రప్రభుత్వం ఎందుకు తెలంగాణకు నిధులు ఇవ్వడం లేదని సీఎం ప్రశ్నించారు. ఈ విషయంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆలోచించాలని కోరారు. అయోధ్య, కుంభమేళాకే కాదని.. మేడారానికి కూడా ప్రధాన మంత్రి నరేంద్రమోదీని ఒప్పించి నిధులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. జాతీయ స్థాయిలో మేడారం జాతరకు కేంద్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలని కోరారు.

## బంగారం సమర్పించిన సీఎం

మేడారం సమ్మక్క, సారలమ్మ ములుగు జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా అమ్మవార్లకు 68 కేజీలనిలువెత్తు బంగారం సమర్పించి, శ్రీ సమ్మక్క సారలమ్మ అమ్మవార్ల, పగిడిద రాజు గోవిందరాజుల దర్శనం చేసుకున్నారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహబూబాబాద్, వరంగల్ ఎంపీలు పోరిక బలరాం నాయక్, కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కెఆర్ నాగరాజు, రేవూరి ప్రకాష్‌రెడ్డి, భూక్య మురళి నాయక్ తదితర నేతలు ఉన్నారు. అనంతరం మేడారం పూజారులు ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డికి అమ్మవార్ల ఆశీర్వాదాలు అందజేశారు.













# ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం చేయాలి

## ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి




**జనగామ, మన చౌరాస్తా :** ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం చేయాలని, పుస్తకం యువత ఆలోచనా విధానాన్ని కొత్త దిశగా తీసుకెళ్తుందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్త అజ్మీరా స్వామి నాయక్ కుమారుడు అజ్మీరా ఠాకూర్ (చిరంజీవి) రచించిన "ద రెబల్ ఆల్గోరిథమ్" పుస్తక ఆవిష్కరణలో పల్లా పాల్గొని మాట్లాడారు. ఠాకూర్ కేవలం 17 ఏళ్ల చిన్న వయసులోనే పుస్తకం రచించడం గొప్ప విషయం అన్నారు. నేటి యువత సామాజిక మాధ్యమాలలో ఎక్కువ సమయం గడుపుతున్న తరుణంలో ఇలాంటి సృజనాత్మక రచనలు నిజంగా ప్రేరణ కలిగించేవి అని అభినందించారు. అలాగే, యువత గంజాయి, డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండి తమ ప్రతిభను సమాజానికి ఉపయోగపడే విధంగా మలచుకోవాలని సూచించారు.



## లయన్ శ్రీభాష్యం రఘుకు ఎమ్మెల్యే పల్లా పరామర్శ

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణంలోని 4వ వార్డుకు చెందిన జనగామ లయన్స్ ప్రతినిధి శ్రీభాష్యం రఘు మాతృమూర్తి శ్రీభాష్యం జయశ్రీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం పట్టణంలోని రఘుకు ఇంటికి వెళ్లి జయశ్రీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.




## దేవీ నవరాత్రి వేడుకల్లో జాగ్రత్తలు పాటించాలి

- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

**హనుమకొండ, మన చౌరాస్తా :** దేవి నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసే వారు తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్‌అన్నారు. పోలీస్ శాఖ మహిళలు బతుకమ్మ ఆడేటువంటి ప్రాంతాల్లో, దుర్గామాత అమ్మవారు ఏర్పాటు చేసిన ప్రాంతాలలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ, పెట్రోలింగ్, విజబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని వేడుకలు జరిగే అన్ని ప్రాంతాలలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు పోలీసు యంత్రాంగం గట్టి భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఉత్సవాలు సజావుగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అగ్ని ప్రమాదాలు లేదా ఇతర అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి తగిన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండి, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అన్ని దుర్గామాత విగ్రహాలను జియో ట్యాగ్ చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా మహిళలు తమ ఇళ్ల ముందు బతుకమ్మ ఆడతారు కాబట్టి బహిరంగ ప్రదేశాలు అవసరమైన పోలీస్ బందోబస్త్ ఏర్పాట్లను చేయాలని సీపీ ఆదేశించారు.



## పండుగ అడ్వాన్స్ ఇవ్వాలలని డీఎంహెచ్‌వోకు వినతి

**భూపాలపల్లి, మన చౌరాస్తా :** లక్షల రూపాయల జీతం పొందే పర్మినెంట్ కార్మికులకు రూ. 25 వేల దసరా అడ్వాన్స్ ఇస్తున్నప్పుడు, ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కూడా కనీసం రూపాయలు రూ.20 వేల దసరా పండుగ అడ్వాన్స్ ఇవ్వాలని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు భాష నాయక్ కోరారు. ఈ మేరకు మంగళవారం డిఎంహెచ్ ఓ డాక్టర్ మధుసూదన్‌కు వినతి పత్రం అందించారు. పర్మినెంట్ ఉద్యోగులకు అడ్వాన్స్ ఇవ్వడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, వారికి రూ.50 వేలు చెల్లించాలని కూడా కోరుతున్నామని చెప్పారు. ప్రతి సంవత్సరం పర్మినెంట్ ఉద్యోగులతో కలిసి శ్రమించి ఎన్ హెచ్ ఎం సంస్థ అభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను విస్మరించడం తగదని భూపాలపల్లి ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ జనరల్ సెక్రెటరీ మధుబాబు పేర్కొన్నారు. తమకు కూడా పండుగ ఉంటుందని ప్రభుత్వం గుర్తించాలని, వారికి కూడా రూ. 20 వేల దసరాకు అడ్వాన్స్ చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డి.పి.ఎం.యూనిట్. డి.పీ.ఓ.చిరంజీవి, శ్రీను, ప్రభాకర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష

**పాలకుర్తి, మన చౌరాస్తా :** పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ - “పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అధికారులు తరచూ సమీక్షించాలి. రహదారులు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, భవన నిర్మాణాలు వంటి ప్రాజెక్టులు వేగవంతంగా పూర్తి కావాలి. ప్రభుత్వం కేటాయించిన నిధులను సమర్థవంతంగా వినియోగించి, నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలి” అని ఆదేశించారు. అలాగే ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేలా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని, పనులలో జాప్యం చోటు చేసుకోరాదని ఎమ్మెల్యే హెచ్చరించారు. “అభివృద్ధి పనులు పూర్తికాక ఆలస్యమైతే ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయి. కాబట్టి తక్షణ చర్యలు తీసుకోవాలి. ప్రతి అధికారిని గ్రామస్థాయిలో పర్యవేక్షణ చేసి ప్రజల అభిప్రాయాలు సేకరించాలి. పారదర్శకతతో పనులు చేయడం ద్వారానే ప్రజల విశ్వాసం నిలుస్తుంది” అని ఆమె స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఈ.ఈ. శ్రీనివాస్ రావు, డి.ఇ. రామలింగ చారి, స్పెషల్ ఏ.ఈ. శ్రీనివాస్, ఏ.ఈ. రాహుల్, ఏ.ఈ. మహేష్ తదితర పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.





## యువ రచయిత సన్మానం

**జనగామ, మన చౌరాస్తా :** కవులు కళాకారుల ఐక్యవేదిక జనగామ అధ్వర్యంలో యువ రచయిత ఠాకూర్ అజ్మీరను బుధవారం ఘనంగా సన్మానించారు. జనగామ విజయ ఫంక్షన్ హాల్ లో అఖిల భారత బంజారా సేవా సంఘం నిర్వహణలో "ద రెబల్ ఆల్గోరిథమ్" అనే పుస్తకాన్ని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత ఠాకూర్ అజ్మీరను ఐక్యవేదిక సన్మానించి అభినందించింది. జనగామ జిల్లాకు చెందిన 17 సంవత్సరాల యుక్త వయస్సులో కలిగిన ఠాకూర్ ఆంగ్లంలో పుస్తకం రాసి ముద్రించడం గొప్ప విషయమని అంటూ ప్రోత్సాహిస్తున్న తండ్రి, తెలంగాణ ఉద్యమకారులు,మాజీ సర్పంచ్ అజ్మీర స్వామి నాయక్, మంగమ్మ దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జి.వై.గిరి ఫౌండేషన్ జి.కృష్ణ, శ్రీశ్రీ కళావేదిక లగిశెట్టి ప్రభాకర్, కవి హృదయం సాహిత్యవేదిక పెట్లోజు సోమేశ్వరాచారి, అభినందన కల్చరల్ సోసైటీ అయిలా సొమనర్సింహచారి, పోతన సాహిత్య వేదిక కల్నల్ మాచర్ల బిక్షపతి,కవులు,వ్యాఖ్యాతలు డాక్టర్ వేముల సదానందం, రంగరాజు ప్రసాద్, చిలుమోజు సాయికిరణ్, పొట్టబత్తిని భాస్కర్, గడ్డం మనోజ్ కుమార్ గౌడ్, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్, గుండె కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.






# కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి

## మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య

**లింగాలఘణపురం, మన చౌరాస్తా :** కేసీఆర్ హయాంలోనే నిజమైన అభివృద్ధి, సంక్షేమం జరిగిందని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన "ఊరూరికి బీ ఆర్ ఎస్ అభివృద్ధి - ఇంటింటికీ కేసీఆర్ సంక్షేమ పథకాలు" కార్యక్రమం జోరుగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య హాజరై, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. "తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత నిజమైన అభివృద్ధి, నిజమైన సంక్షేమం అందించగలిగింది ఒక్క బీఆర్‌ఎస్ పార్టీ మాత్రమే. సీఎం కేసీఆర్ రైతులకు రైతు బంధు అందించారు, వృద్ధులకు ఆసరా పెన్షన్ ఇచ్చారు. తెలంగాణ కోసం రాత్రింబవళ్లు కష్టపడిన నాయకత్వం బీఆర్‌ఎస్‌దే. కాంగ్రెస్ పార్టీకి మాత్రం ప్రజలపై నిబద్ధత లేదు. వారు అధికార కుర్చీ కోసం మాత్రమే కష్టపడ్డారు కానీ ప్రజల కోసం ఒక్క అడుగు ముందుకు వేయలేదు. ఇచ్చిన హామీలు అన్నీ అబద్ధాలు, మోసాలు, మభ్యపెట్టే నాటకాలు మాత్రమే. ముఖ్యంగా కడియం శ్రీహరి ఈ నియోజకవర్గ ప్రజలకు చేసిన మోసాలు మరువలేనివి. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా ఈ ప్రాంతానికి ఒక్క రూపాయి విలువైన అభివృద్ధి కూడా తెచ్చిపెట్టలేదు. ఉద్యోగాలు ఇస్తామని చెబుతూ వేలాది



నిరుద్యోగులను మోసం చేశారు. రైతుల యూరియా సమస్యలపై ఒక్కసారి కూడా పోరాడలేదు. కడియం శ్రీహరి రాజకీయాలు ఎప్పుడూ ప్రజల కోసం కాదు, పదవుల కోసం మాత్రమే." అని రాజయ్య మండిపడ్డారు. అలాగే, "ప్రజలు ఇప్పుడు కాంగ్రెస్ మోసాలను గుర్తించి, వారిని తుడిచిపెట్టేస్తున్నారు. తెలంగాణ భవిష్యత్తు బీఆర్‌ఎస్ చేతుల్లోనే సురక్షితం. కేసీఆర్ - కేటీఆర్ నాయకత్వమే ప్రతి గ్రామానికి అభివృద్ధి, ప్రతి ఇంటికి సంక్షేమం అందిస్తుంది" అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మందోనిగుడెం, కళ్ళెం, మానిక్యపురం, ఎనబావి, సిరిపురం, జీడికల్, రామచంద్రపురం, నాగారం గ్రామాల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కొమురవెల్లి మాజీ చైర్మన్ సేవెల్లి సంపత్, స్థానిక నాయకులు చిల్ల ఉపేందర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రద్దయిన బస్సు పునఃప్రారంభం

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** వారం రోజులుగా జనగామ డిపోకు చెందిన జనగామ-పికెట్ బస్సు (వడ్లకొండ, కేసిరెడ్డిపల్లి మార్గం) రద్దు కావడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా కేసిరెడ్డిపల్లి నుండి సికింద్రాబాద్‌కు వెళ్లే ప్రయాణికులు రాకపోకల కోసం తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు అందరూ కలిసి జనగామ డిపో మేనేజర్ స్వాతిని కలసి సమస్యను వివరించారు. వెంటనే స్పందించిన మేనేజర్, అదే రోజు బస్సును మళ్లీ ప్రారంభించారు. గ్రామ ప్రజల తరఫున డిపో మేనేజర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మల్లవరం వెంకటేశ్వర్ రెడ్డి, కాపర్తి హరి ప్రసాద్, శ్రీనివాస్, నల్లగొప్పుల బాలరాజ్, బైరగోని రవి, తిరుపతి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చేపట్టిన స్వస్త్ నారి - సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా ఎముకల వ్యాధుల నిపుణుడు డా. చెన్నం శ్రీపాల్ హాజరై మహిళలకు ఎముకల సంబంధిత సమస్యలపై పరీక్షలు నిర్వహించి, తగిన సలహాలు అందించారు. ఆధునిక జీవనశైలి, పోషకాహార లోపం, కాల్షియం లోపం వంటి కారణాలతో గ్రామీణ మహిళల్లో ఎముకల బలహీనత, నొప్పులు, ఆర్థరైటిస్ సమస్యలు ఎక్కువగా పెరుగుతున్నాయని అన్నారు. అనంతరం ముల్కనూరు పీఎచ్సీ వైద్యుడు డా. ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ, మహిళల ఆరోగ్యం బలపడ్డప్పుడే కుటుంబం, సమాజం బలపడుతుందని, అందువల్ల ఈ శిబిరాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శిరీష్ రెడ్డి, రాజయ్య, రత్నభారతి, జ్యోతి, రాజు, మహేందర్, కళ, వనజ పాల్గొన్నారు.



## ముల్కనూరులో పశువైద్య శిబిరం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** ముల్కనూరు ప్రాంతీయ పశువైద్యశాలలో ఈరోజు గోజాతి, గేదజాతి పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి స్థానిక పశువైద్య సిబ్బందితో పాటు వరంగల్ ప్రాంతీయ పశువైద్య శిక్షణా కేంద్రం వైద్యులు, సిబ్బంది, ప్రాంతీయ వ్యాధి నిర్ధారణ కేంద్రం అధికారులు, కరీంనగర్ పశుగణాధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ హాజరయ్యారు. శిబిరంలో ఈ ప్రాంతానికి చెందిన పాడి రైతులు తమ పశువులను తీసుకువచ్చి పరీక్షలు చేయించుకున్నారు. వ్యాధి నిర్ధారణ అనంతరం పశువులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఇంటాస్, మ్యాన్‌కైండ్, నేచురల్ రెమెడీస్ సంస్థలు సహకరించి ఉచిత మందులు అందజేశాయి.



## ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని వినతి

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** మండలంలోని ఐనాపూర్ సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పలు ఇండ్లను పరిశీలించారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి తాడూరు రవీందర్ మాట్లాడుతూ మండలంలోని శిథిలావస్థలో ఉన్న 11 గ్రామాల పెంకుటిళ్లను పరిశీలించి ప్రజల ప్రాణాలను కాపాడాలని అన్నారు. గ్రామంలో భారీ వర్షం కురుస్తున్న క్రమంలో నిద్రమత్తులో ఉన్న సున్నం బుధవ్వ వారి మనవరాలు మనవడు నిద్రిస్తున్న సమయంలో సుమారు రాత్రి 10:30 కు భారీ వర్షంతో పెంకుటిల్లు ఒకేసారి మట్టి పడడంతో అలర్ట్ అయినా నానమ్మ పిల్లలు కేకలు వేస్తూ బయటకు వచ్చారు త్రుటిలో తప్పిన ప్రమాదం తప్పిందన్నారు. సున్నం యాదగిరి గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ బ్రతుకుతూ ఉంటారు కనీసం వీరిలో ఒక్కరికైనా ఇందిరమ్మ ఇల్లు ఇస్తే వారి తల్లికి పిల్లలకు ఇబ్బంది కలగకుండా ఉంటుందన్నారు. మండల, జిల్లా అధికారులు స్పందించి వీరికి ఇందిరమ్మ ఇల్లు వచ్చే విధంగా చూడాలని కోరారు. మండలంలో నిరుపేదలైన అన్ని గ్రామాలలో శిథిలావస్థలో ఉన్న పెంకుటిళ్లను పరిశీలించి అందరికీ ఇందిరమ్మ ఇల్లు



ఇవ్వాలని ఇదే క్రమంలో ప్రమాదము ఉండే ఇళ్లను గుర్తించి ప్రజలను కాపాడడం కోసం వేరే ఇళ్లల్లోకి ఉండేలాగా ప్రభుత్వం గ్రామాల్లో కార్యదర్శులు మండల జిల్లా అధికారులు బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు తేలు ఇస్తారీ, పుల్లంపల్లి సాయిలు, గ్రామ కార్యదర్శులు కానుగుల రాజు, పాశం చంద్రయ్య, పబ్బోజు నవీన్, దండు శంకర్, కర్రోళ్ల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.